సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సమన్వయంతోనే లక్ష్యసాధన

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాను అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే క్రమంలో బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యసాధనను సాధించవచ్చని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని బ్యాంకర్లు సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులతో డిసిసి, డీఎల్‌ఆర్సీ సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత 2022-23 సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళిక రూ.8133.71 కోట్లకు గాను రూ.10,985.97 కోట్ల ప్రగతిని సాధించినందుకు అభినందించారు. జిల్లా వార్షిక ప్రణాళికలో ప్రధానంగా విద్యా, వ్యవసాయం, పరిశ్రమల స్థాపన, ఎంఎస్ఎంఈ రంగాలకు ప్రాధాన్యత కల్పించాలని ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి శ్రీ సత్యసాయి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక రూ.10,808.35 కోట్లతో సిద్ధం చేశామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరాన్ని రుణ ప్రణాళికలో పరిశ్రమలు ఎంఎస్ఎండి రంగాలకు రూ. 1401.91 లక్ష్యానికి గాను రూ.922.85 కోట్లు, వ్యవసాయ రంగాలకు సంబంధించి రూ.4994.01 కోట్లకు గాను రూ.7353.92 , కోట్లు, విద్యారంగానికి సంబంధించి రూ.49.24 కి గాను రూ.25.3 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. హౌసింగ్ రుణాలకు సంబంధించి రూ.302.34 కి గాను రూ.307.73 కోట్లు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. బ్యాంకులకు వచ్చే రైతులకు, పారిశ్రామికవేత్తలకు అర్హత ఉన్న వారికి రుణాలు అందించడంలో ఇబ్బందులు కు గురి చేయకుండా బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణ సదుపాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన దరఖాస్తులను వివరాలను ఎప్పటికప్పుడు జాబితాలను సిద్ధం చేసుకుని రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. వెనుకబడిన ప్రాంతంలో 10 తరగతిలో ఉత్తీర్ణులైన మెరిట్ విద్యార్థులకు విద్య రుణాలు మంజూరు చేయాలని, జన సురక్ష కార్యక్రమంలో పురోగతి సాధించాలని, స్టాండ్ అప్ ఇండియా రుణాల మంజూరులో జాప్యం చేయకుండా దరఖాస్తులను పరిశీలించి ఆయా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం కెవి.రమణ కుమార్, ఆర్‌బిఐ యల్‌డిఒ రెహమాన్, ఏపీజీబీ ఆర్ఒ రవీంద్రారెడ్డి, ఎల్‌డిఒ వివేకానంద, డిక్కీ మరియు ఫిక్కీ సభ్యులు రమణ , ప్రసాద్ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆడిటోరియం.. అవరోధం..!

స్నాతకోత్సవం నాటికైనా సిద్ధమయ్యేనా..?

సాంకేతిక విశ్వవిద్యాలయం భవన నిర్మాణం లోపాలమయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విశ్వ సాంకేతిక విజ్ఞానాన్ని అందించే విశ్వవిద్యాలయంలో చేపట్టిన భవన నిర్మాణం ఆది నుంచి లోపాలమయంగానే సాగుతూ వస్తోంది. అనంతపురం జెఎన్‌టియులో ఆడిటోరియం ఐదేళ్లు తిరగకుండానే పైకప్పు పోయి ఫ్లోరింగ్ కూడా దెబ్బతింది. ఇప్పుడు దీని మరమ్మతులకు మరో అర కోటి వరకు ఖర్చు కానుంది. విశ్వవిద్యాలయంకు సంబంధించిన పెద్ద కార్యక్రమాలేమైనా నిర్వహించేందుకు వీలుగా అనంతపురం జెఎన్‌టియులో 1100 మంది కూర్చేనా 99 టన్ను ఎసి సామర్థ్యంతో 2004లో రూ.10 కోట్లకుపైగా వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు. దీని నిర్మాణాలు అనుకున్నంత వేగంగా ముందుకు సాగలేదు. నత్తనడకన నడుస్తూ వచ్చాయి. దీనిపై కాగ్ సైతం తాఖీదులిచ్చింది. అయితే అనేక ఆపసోపాల నడుమ దీని నిర్మాణాన్ని 2018లో పూర్తి చేశారు. దీనికి ఎన్టీఆర్ కళాక్షేత్రమన్న పేరునూ పెట్టారు. ఈ భవనం ప్రారంభమై సరిగ్గా ఐదేళ్లు కూడా గడవకనే ఇది దెబ్బతింది. మరమ్మతలు చేపడితేగాని కార్యక్రమాలు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయి. పైకప్పు దెబ్బతిని, నీళ్లు, దుమ్ము అంతా పడటంతో ఫ్లోరింగ్ కూడా దెబ్బతింది. ఇప్పుడు దీని మరమ్మతులకు రూ.54 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు టెండర్లు సైతం ఆహ్వానించారు. అయితే ఇవి పూర్తయి మరమ్మత్తులు చేపట్టేందుకు ఎంత సమయం పడుతుందో చూడాల్సి ఉంది.

మరమ్మతులు కాకపోతే స్నాతకోత్సవం ఎలా ?

సాధారణంగా ఆగస్టు మాసంలో అనంతపురం జెఎన్‌టియులో స్నాతకోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమాన్ని ఆడిటోరియంలోనే నిర్వహిస్తారు. ఎందుకంటే అనంతపురం నగరం పరిధిలో ఇంతటి ఏర్పాట్లతోనున్న మరో ఆడిటోరియం ఎక్కడా లేదు. ఈ ఒక్క చోటే 1100 మంది కూర్చేనే కెపాసిటీతో ఆడిటోరియం ఉంది. అయితే ఇప్పుడు దెబ్బతిన్న ఈ ఆడిటోరియం టెండర్లు పూర్తి చేసి మరమ్మతులు పూర్తి చేయడం ఈ రెండు మాసాల వ్యవధిలోపు సాధ్యమవుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇది పూర్తవకపోతే ఎక్కడ స్నాతకోత్సవం నిర్వహిస్తారన్నది కూడా చూడాల్సి ఉంది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందించే విశ్వవిద్యాలయంలోనే ఒక ప్రతిష్టాత్మక భవన నిర్మాణం ఈ రకంగా తక్కువ సమయంలో దెబ్బతినడం విమర్శలకు తావిస్తోంది.

టెండర్లు ఆహ్వానించాం

శశిధర్, రిజిస్ట్రారు,అనంతపురం జెఎన్‌టియు

జెఎన్‌టియు ఆడిటోరియం మరమ్మతులకు రూ.54 లక్షలతో టెండర్లు ఆహ్వానించాం. త్వరితగతిన పనులు ప్రారంభం కానున్నాయి. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం.

అవార్డును చూపుతున్న రత్నాకర్, తదితరులు

శ్రీ సత్యసాయి ఆసుపత్రి బృందానికి రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేసింది. పర్యావరణాన్ని పరిరక్షించడంలో శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సిబ్బంది తీసుకున్న చొరవకు గుర్తింపుగా విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డును శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చైర్మన్ గురుమూర్తికి అందజేశారు. అవార్డు రావడం పట్ల చైర్మన్ గురుమూర్తిని ఆసుపత్రి సిబ్బందిని శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ అభినందించారు.

సేకరించిన భూములకు నష్టపరిహారం అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ టిఎస్ చేతన్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములకు సంబందించి త్వరగా నష్టపరిహారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబరు లో ఎన్ హెచ్, ఆర్ అండ్ బి, సర్వే, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారుల కోసం ఆయా మండలాల పరిధిలో సేకరించి అవార్డు పాస్ చేసిన భూములకు త్వరగా నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. జరుగుతున్న పనుల పురోగతిపై పుట్టపర్తి, గోరంట్ల, బుక్కపట్నం, కొత్తచెరువు తహశీల్దార్లతో ఆరా తీశారు. ప్రతివారం సమీక్ష జరుగుతుందని పెండింగ్ లో ఉన్న పనులు వేగవంతం చేయాలని అన్నారు. రహదారుల కోసం అటవీ భూమి సేకరించి ఉంటే అందుకు రెట్టింపు భూములు అడవి శాఖకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. మొత్తం 136.62 హెక్టార్ల విస్తీర్ణానికి రూ. 18.27 కోట్లు మంజూరు అయిందని చెప్పారు. ఇప్పటికే 80.41 హెక్టార్ల విస్తీర్ణానికి రూ. 12.90 కోట్లు అందజేశామని అన్నారు. ఈ రహదారులు పూర్తి అయితే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని చెప్పారు. నష్ట పరిహారం చెల్లింపులో ఎప్పటికప్పుడు నివేదికలు అందిస్తే పెండింగ్ లో ఉన్న నష్టపరిహారం అందించడానికి వీలు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎన్‌హెచ్ ఎస్ఇ మురళీమోహన్, డిఎఫ్ఒ రవీంద్రనాథ్ రెడ్డి, సర్వే ఏడీ రామకృష్ణ, ఆయా మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఫ్యాప్టో నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య నాయకులు మాట్లాడుతూ పాఠశాలల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు. పాఠశాల వ్యవస్థను చిన్న భిన్నం చేస్తున్న జీవో ఎం ఎస్ 117ను రద్దు చేయాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. పదోన్నతులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, సిఆర్‌సి ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల వేతనాలు 11 పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కోడూరు శ్రీనివాస్, రామకృష్ణ, కోనంకి చంద్రశేఖర్, హరిప్రసాద్, ఆర్ చంద్ర, సురేంద్ర, శివ శంకర్, జయశేఖర్, జయరాం రెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై వారు బుధవారం స్థానిక తహశీల్దార్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చలపతి మాట్లాడుతు అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులపై, ఎరువుల ధరలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నా ఇన్‌పుట్ సబ్సిడీనివెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోనిపలు ప్రాంతాలను పరిశీలించారు. వార్డు కౌన్సిలర్‌లను, ప్రజలను కలిసి వారు ఎదుర్కోంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మురుగు కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్యం మెరుగుపర్చడం కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. ముక్కడిపేట ప్రాంతంలో చిన్న పాటి వర్షాలకే మురుగు కాలువలు నిండి రోడ్డుపైకి వస్తున్నట్లు కొంత మంది ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. ఇక్కడ మురుగు కాలువల వ్యవస్థలో లోపం ఉందన్నారు. పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాసీరా బాను షఫీవుల్లా, ఎఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు చేస్తున్న ప్రాంతం ఇదే...

బీకేఎస్‌లో మట్టి దోపిడీ..!

◆ పట్టపగలే యథేచ్ఛగా తరలింపు ◆ చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల్లో మట్టిని తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అధికార పార్టీ నేతలే ఈ మట్టి దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా విన్పిస్తున్నాయి. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన స్థలంలో ఇటీవల అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుని అనుచరుడు, లీజుదారుడు మట్టిని జెసిబిలు, ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగానే ఈ మట్టి దోపిడీ జరుగుతున్నా రెవెన్యూ, సంబంధిత గిరిజన గురుకుల పాఠశాల అధికారులు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. బుక్కరాయసముద్రం మండల కేంద్రం సర్వే నంబరు 396-7 సమీపాన గిరిజన సంక్షేమ శాఖకు చెందిన గురుకుల పాఠశాల నిర్మాణానికి 5 ఎకరాలకు పైగా స్థలాన్ని ప్రభుత్వం కేటాయించి స్వాధీనం చేసింది. ప్రభుత్వం నిధులు సకాలంలో ఇవ్వకపోవడంతో ఈ స్థలంలో నిర్మాణ పనులు మొదలు కాలేదు. ఇదే అదునుగా అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుని అనుచరుడుగా ఉన్న వ్యక్తి గ్రావెల్ కోసం స్కూల్ స్థలంకు ఎసరు పెట్టేందుకు పథకం రచించారు. మట్టి తరలించేందుకు అనుమతులు పేరుతో గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో పట్టపగలే తన సొంత జెసిబితో మట్టిని తవ్వి అమ్మకాలు చేస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి పొందిన స్థలంలో కాకుండా గిరిజన గురుకుల పాఠశాలకు సంబంధించిన స్థలంలో మట్టిని తవ్వుతూ అక్రమంగా తరలిస్తున్నా అధికారులు నోరుమెదపడం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన స్థలాలను నాశనం చేసి ఇలా మట్టి తరలించుకుపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బుక్కరాయసముద్రం గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని రక్షించేలా బోర్డులు ఏర్పాటు చేయాలంటూ తరచూ పత్రికల్లో కథనాలు వస్తున్నా, ప్రజాసంఘాల నేతలు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్న దానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా మండల రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి వారి స్థలం జరుగుతున్న అక్రమ మట్టి రవాణాని నియంత్రించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదంలో సిఎస్‌డిటి మృతి

భార్య, కుమారుడు, డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - పెద్దవడుగూరు

మండల పరిధిలోని మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో సిఎస్‌డిటి కరుణాకర్(52) మృతి చెందగా ఆయన భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండల రెవెన్యూ కార్యాలయంలో పౌరసఫరాల ఉప తహశీల్దార్(సిఎస్‌డిటి)గా పని చేస్తున్న కరుణాకర్ తనకు వైద్యం చేయించుకునేందుకు భార్య వరలక్ష్మి, కొడుకు సాయితో కలిసి కారులో కర్నూలులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వెళ్తుండగా మిడుతూరు వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కరుణాకర్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య, కుమారుడు, డ్రైవర్‌కు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుడు కరుణాకర్

విద్యార్థులకు ఆర్టీసీ బస్సు పాసులు ఇవ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు పాసులను వెంటనే ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రారంభమయ్యాయని అన్నారు. దీంతో ప్రతి రోజు విద్యార్థులు కళాశాలకు వస్తున్నారని అయితే ఇంత వరకు ఆర్‌టిసి సంస్థ బస్ పాసులను మంజూరు చేయక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి విద్యార్థులకు బస్సుపాసులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలల సమయానికి అనుగుణంగా ఆయా గ్రామాలకు బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలను చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న బాబావలి

నేడు బత్తలపల్లి ఎంపీపీ ఎన్నిక

బత్తలపల్లి : బత్తలపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి గురువారం ఎన్నిక నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వైస్ ఎంపీపీ గజ్జెల వెంగారెడ్డి ఇన్‌ఛార్జి ఎంపీపీగా కొనసాగుతున్నారని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీపీ ఎన్నికను నిర్వహించేందుకు సత్యసాయి జిల్లా సర్వే డిపార్ట్‌మెంట్ డిఎస్ఒ రామకృష్ణను ప్రత్యేక అధికారిగా మండలానికి ప్రభుత్వం నియమించిందన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

ఎన్నిక లాంఛనమే.. బత్తలపల్లి ఎంపీపీగా అప్రాచెరువు ఎంపీటీసీ బగ్గిరి త్రివేణిరెడ్డి ఎంపిక లాంఛనప్రాయమేనని తెలుస్తోంది. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు బగ్గిరి త్రివేణిరెడ్డి ఎంపిక చేయడంతో ఎన్నిక లాంఛనప్రాయమే. ఎన్నిక అనంతరం ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి భయపరెడ్డి సతీమణి బగ్గిరి త్రివేణిరెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయనుండడంతో అభిమానులు కార్యకర్తలు కూడలిలో భారీగా అభినందనలు తెలుపుతూ స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఇన్‌ఛార్జి డిఇఒగా రంగస్వామి

కొత్తచెరువు : శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒగా పెనుగొండ డిప్యూటీ డీఈవో రంగస్వామిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డిఇఒ మీనాక్షి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రంగస్వామికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

బదిలీ అధికారికి సన్మానం

రొళ్ల : బదిలీపై వెళ్తున్న రొళ్ల తహశీల్దార్ హసీనాసుల్తాన్‌ను పలువురు అధికారులు, రాజకీయ నాయకులు బుధవారం సన్మానించారు. మండలంలో ప్రజలకు అందించిన సేవలను నాయకులు అధికారులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ నాగేంద్ర, బిజె హళ్లి సర్పంచి నరసింహప్ప, నాయకులు పట్టాభి, ముద్దాజ్, శ్రీనివాస్, సంతోష్, ఎంజార్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి డిపోలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఉద్యోగి బాలరాజును ఆఫీసు సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ మైనొద్దీన్ మాట్లాడుతూ బాలరాజు సేవలు ప్రశంసనీయమని అన్నారు. అనంతరం బాలరాజుకు డిపో మేనేజరుతో పాటు అసిస్టెంట్ మేనేజర్ శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సిబ్బంది అబ్బాస్, బాలునాయక్, సుబ్బారెడ్డి, క్రిష్టయ్య, బాబు, రూత్ హెలెన్, ఎస్ఎంఎ నాయకులు బైరిశెట్టి, ఉత్తన్న, రవీంద్ర, ఎస్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గోరంట్ల రూరల్ : మండలంలోని మల్లాపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపిపి ప్రమీలామూర్తి, ఎంపీడిఒ రఘునాథ గుప్త బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైయస్ఆర్ బీమా నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలనీ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య ఉప కార్యాలయాన్నిసందర్శించి వ్యాక్సినేషన్ గురిం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపల్లి సర్పంచి శివానంద, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక గురువారం నిర్వహిం చనున్నట్లు మున్సిపల్ అధికారులు బుధవారం తెలిపారు. రెండేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న లింగం నిర్మల మే 5న రాజీనామా చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వైస్ ఛైర్ పర్సన్ గా ఉన్న భాగ్యలక్ష్మిని తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా కొనసాగారు. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈనెల 8న(గురువారం) మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గురువారం ఉదయం 10గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా ఆర్డీవో తిప్పేనాయక్ వ్యవహరించనున్నారు.

అవయవాల దానం

అమరాపురం : మండల పరిధిలోని బసవన్నపల్లికి చెందిన తిప్పమ్మ మృతిచెందిన నేపథ్యంలో ఆమె అవయావాలను దానం చేయడానికి ఆమె కుటుంబసభ్యులు అంగీకరించారు.కర్నాటక రాష్ట్రంలోని జయదేవ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఆమె అవయవాలను దానం చేసినట్లు మృతురాలి భర్త వీరసేనప్ప, సిఆర్‌పిఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న కుమారుడు నగేష్ తెలిపారు.

వేతనాలు విడుదల చేయాలి

పరిగి : కాంట్రాక్టు వాచ్‌మెన్ ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈసందర్భంగా తహశీల్దార్ కార్యాలయ వాచ్‌మెన్ మంజునాథ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 63 మంది పోస్టులకు గాను కాంట్రాక్ట్ పేరుతో తీసుకున్న ఉద్యోగులకు 24 నెలలకు సంబంధించి వేతనాలు ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులపై శీతకన్ను చూపుతున్నారన్నారు. కాంట్రాక్ట్ యాజమాన్యం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన

పరిగి : వేసవి సెలవులు పూర్తి అయ్యేలోపు నాడు నేడు పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో సరస్వతి పాఠశాల ఛైర్మన్‌కు, కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లి సచివాలయాన్నితనిఖీ చేసిన ఆమె జడ్పీహెచ్ పాఠశాలలో నాడు నేడు పథకం కింద రూ 1.14 కోట్ల అంచనాతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని ఆదేశించారు. పాఠశాలను పరిశీలించిన ఆమె ఇప్పటికే పూర్తిస్థాయిలో పనులను చేపట్టామనివేసవి సెలవులు పూర్తయ్యే లోపు పనిలో ముగింపు దశకు వచ్చే అవకాశం ఉందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ నజ్మాభాను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదను అరికడతాం

గాండ్లపెంట : ఇటీవల మండలంలో పశువులు, మేకలు, ప్రజలపై వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని వీటి బెడదను అరికడతామని ఎంపిడిఒ అంజినప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కుక్కల బెడద ఎక్కువైందన్నారు. కుక్కలను పట్టేవారిని పిలిపించామన్నారు. ఇప్పటికే దాదాపు వంద కుక్కలను పట్టి తూర్పు ప్రాంతాలకు తరలిస్తున్నామని ఆయన తెలిపారు.

రాగి పంట సాగు పెంపు పై అవగాహన

పెనుకొండ : మండలంలోని గుట్టూరు, మునిమడుగు రైతు భరోసా కేంద్రాలలో రాగి పంట సాగు విస్తీర్ణం పెంపుపై రైతులకు అవగాహన సదస్సులను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెనుకొండ ఎడిఎ స్వయంప్రభ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరాన్ని ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా చిరుధాన్యాలలో ఒకటైన రాగి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని చెప్పారు. మేలు జాతి రకాలైన ఇంద్రావతి వేదవతి రాగి విత్తనాన్ని ప్రభుత్వం 50శాతం రాయితీతో అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ అశోక్ కుమార్, రైతు భరోసా సిబ్బంది భానుశ్రీ, లోకేష్ రైతులు పాల్గొన్నారు.

కోట ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

కోట ప్రాంతంలో ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ పరిధిలోని17వ వార్డు కోట ప్రాంతంలో ఎన్టీఆర్ ఆరోగ్య రథంతో ఆ ప్రాంత ప్రజలకు బుధవారం ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వివిధ దీర్ఘకాలిక రోగులకు, ఇతర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ హిదయతుల్లా, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ రమేష్ కుమార్ మాట్లాడుతు పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సంచార ఆరోగ్య రథాన్ని ఏర్పాటు చేసి పట్టణం నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కర్నాటక మంత్రి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కర్నాటక రాష్ట్ర మంత్రి కె.హెచ్ మునియప్ప ఖాద్రి లక్ష్మీనరసింహస్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటి ఛైర్మెన్ జరిపిటి గోపాలక్రిష్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాస రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ.ఎ.వి.నరసింహచార్యులు తదితరులు ఆయనకు తూర్పురాజగోపురము వద్ద స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు జరిపించి వారికి తీర్థ ప్రసాదములు, శ్రీస్వామి చిత్రపటము, శేషవస్త్రములు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు కుమార్ రాజ చార్యులు, ముఖ్య అర్చకులు అంజన్ కుమార్ చార్యులతో పాటు ఆలయ పాలక మండలి సభ్యులు పాలకమండలి సభ్యులు, ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ ఛైర్మన్ హరి ప్రసాద్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానిస్తున్న దృశ్యం

వివాదాస్పద ఫ్లెక్సీ తొలగింపు

ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం రాత్రి వైసిపి నాయకుడు ఏర్పాటు చేసిన వివాదాస్పద ఫ్లెక్సీని సిఐ,మన్సురుద్దీన్, ఎస్ఐ టీవీ శ్రీహర్ష సామరస్య పూర్వకంగా తొలగింప చేయించారు. బుధవారం పలువురు టిడిపి నేతలు బత్తలపల్లి పోలీసుల దృష్టికి వైసిపి నాయకుడు ఏర్పాటు చేసిన వివాదాస్పద ఫ్లెక్సీ విషయాన్నితీసుకువెళ్లారు. రాష్ట్రంలోని పలుచోట్ల వైసిపి నాయకులు ఏర్పాటుచేసిన 'పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం, పేరిట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో వైసిపి, టిడిపి,జనసేన పార్టీల నడుమ ఫ్లెక్సీల వివాదం ఘర్షణలకు దారి తీసిన విషయం తెలిసిందే. కూడలిలో ఫ్లెక్సీ వెలసిన వెంటనే టిడిపి నేతలు స్పందించి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జక్కంపూడి నాగభూషణ, జొన్నలగడ్డ రంగనాయుడు, తాళ్లూరు సతీష్ కుమార్ చౌదరి, ఎం.చెర్లోపల్లి చౌదరి, నెట్టెం శ్రీనివాస్,రామాపురం కేశవ,నెట్టెం రమణ, సదాశివ, నాగార్జునరెడ్డి,జనసేన నాయకులు పూల రవి,గొట్లూరు రామాంజనేయులు తదితరులు పోలీస్ స్టేషన్ కి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెను వెంటనే వైసిపి నాయకుడు కోటి సూర్యప్రకాష్ బాబుతో ఫోన్లో మాట్లాడారు. పంచాయతీ సిబ్బందిచే వివాదాస్పద ఫ్లెక్సీ తొలగింప చేయించారు. అనంతరం ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం కూడా వివాదాస్పద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని సూచించిందని, ఈ విషయం తనకు తెలియక ఫ్లెక్సీ ఏర్పాటు చేశానని చెప్పారు. ఎవరికి ఇబ్బంది లేకుండా ఫ్లెక్సీ తొలగింపునకు సహకరించినట్లు తెలిపారు.

చేనేతకార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పవర్ లూమ్‌లో ప్యూర్ టూ ప్యూర్ నేయరాదంటూ ఏపీచేనేతకార్మికసంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులు ధర్మవరం పట్టణంలో ధర్నా చేపట్టారు. ముందుగా సీపీఐ జిల్లాకార్యదర్శి వేమయ్యయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేనేతకార్మికసంఘం అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో తాలూకా చేనేతనాయకులు, కార్మికులు గాంధీనగర్ సర్కిల్ మంచికళాజ్యోతి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి ఆందోళకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో కొన్ని నెలలుగా చేనేత కార్మికల పరిస్థితి దర్భిష్టంగా తయారైందన్నారు. వీటికి కారణం పవర్ రీమ్లో చేనేత రకాలు నేయడం వల్ల చేనేతకు తీవ్ర సంక్షోభం పట్టుకుందన్నారు. పవర్లూమ్లో మిక్సింగ్ మాత్రమే నేనుకోవాలన్న నిబంధనలు ఉన్న వాటిని తుంగలోకి తొక్కి ప్యూర్ టూ ప్యూర్ నేస్తున్న చేనేత కార్మికుల పొట్టకొడుతున్నారని మం డిపడ్డారు. వీటికి ప్రజాప్రతినిధులు, అధికారులు వత్తాసు పలుతున్నారన్నారు. చేనేతకార్మికులను ఆత్మహత్యల నుండి కాపాడాలన్నారు. అనంతరం ధర్నా చేసు న్నట్టు సమాచారం అందుకున్న వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ మహమ్మద్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఏవైనా సమస్యలుంటే అధికారులతో మాట్లాడాలని ఇలా రోడ్లపైకి వచ్చి ధర్నా చేయరాదని, వెంటనే ధర్నా విరమించాలని తెలపగా వారు ఆర్డీఓ వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించమని భీష్మించికుర్చున్నారు. దీంతో పోలీసులు ధర్నా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు గంగాధర్, శ్రీనివాసులు, లోకేశ్, వెంకటనారాయణ, శేఖరరాజు, మంజు, గోవర్ధన్, శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గసభ్యులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కూడలిలో పోలీసుల మకాం!

ప్రజాశక్తి బత్తలపల్లి

'ఆపరేషన్ కూడలి' పేరుతో బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఎస్ఐ శ్రీహర్ష తన సిబ్బందితో నాలుగు రోజులుగా మకాం వేశారు. ట్రాఫిక్‌పై దృష్టి సారించి పలువురికి రహదారి పైనే కౌన్సిలింగ్ చేపట్టారు. బత్తలపల్లి కూడలిలో నిత్యం అస్తవ్యస్తమైన ట్రాఫిక్, పండ్లు కూరగాయలు, పూలు అమ్మకం దారులతో కూడలి కిక్కిరిసి ఉంటుంది.అదేవిధంగా ఆటోలు, ప్రైవేటు వాహనాలు క్రమ పద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ రహదారిపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకు వెళ్తుండడంతో ఇతర వాహనాలు వెళ్లలేక ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. బత్తలపల్లి మీదుగా అనంతపురం - కదిరి జాతీయ రహదారి, ధర్మవరం తాడిపత్రి ప్రధాన రహదారులు నుండి ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుండడంతో ప్రయాణికుల రద్దీ కూడా అధికంగానే ఉంటుంది. పలువురు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు నిత్యం ఈ రహదారులపై ప్రయాణిస్తూ పలుమార్లు బత్తలపల్లి కూడలి ట్రాఫిక్ లో ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు ఉన్నాయి. ఆటోలు,ప్రైవేటు వాహనాలకు పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా పెడచెవిన పెట్టడంతో ఎస్ఐ శ్రీహర్ష నేరుగా తన సిబ్బందితో ఆపరేషన్ కూడలి పేరుతో చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆటోలను పట్టుకొని ఏకంగా రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. కూడలిలో పూలు పండ్లు కూరగాయలు అమ్ముకునే వారికి కూడా హెచ్చరిస్తూ నిర్దేశించిన ప్రదేశాలలోనే అమ్మకాలు సాగించాలని లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు. చికెన్, మటన్ షాపుల వారిని కూడా పిలిపించి కూడలిలోనే కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రధాన రహదారుల మధ్య ఉన్న డివైడర్లలో వేసిన వ్యర్థ్యలను తొలగింపజేశారు. కూడలిలో దాదాపు వారం రోజులపాటు పలు వర్గాల వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వారు పద్ధతులు మార్చుకోకపోతే జరిమానాలు, కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ప్రజాసేవలోనే సంతృప్తి

ప్రజాశక్తి ధర్మవరలో టౌన్

పేద ప్రజలకు సేవ చేయడములోనే ఎంతో సంతృప్తి ఉందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, రామకృష్ణ, కోశాధికారి జయసింహ, క్యాంపు ఛైర్మన్ సోలిగాళ్ళ వెంకటేశులు పేర్కొన్నారు. సాంస్కృతిక మండలిలో ఈనెల 11న రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరానికి సంబందించిన కరపత్రాలను వారు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం కేవలం పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడానికే అని అన్నారు. కోట మున్సిపల్ పాఠశాలలో ఈశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోటరీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనంతపురం జిల్లా సహాయ సహకారాలతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, సభ్యులు నాగభూషణం, కొండయ్య, సత్రశాల ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తన వేరుశనగ పంపిణీ : ఎఒ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - రొళ్ల

మండలంలోని రైతులకు సకాలంలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నామని ఎఒ రాజ్యలక్ష్మి తెలిపారు. రైతులకు అందని సబ్సిడీ వేరుశనగ అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎఒ స్పందించారు. ఇన్‌ఛార్జి ఎంపిఒ ప్రసాద్ సమయానికి విధులకు హాజరవుతున్నారని ఈ విషయంపై రైతులతో కూడా చర్చించామని చెప్పారు. విత్తన వేరుశన నాణ్యతను పరిశీలించిన తరువాతనే బస్తాలను దించుకున్నామని చెప్పారు. ఆ సమయంలో ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవటంతో తమ సిబ్బంది నాణ్యతను పరిశీలించి బస్తాలను దించుకున్నారని వివరించారు. అలాగే విత్తన వేరుశనగను బ్యాడిగెర గ్రామ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్థలంలో దించడంవల్ల సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసుకోలేక విత్తన వేరుశనగ సరాఫరా ఇబ్బందిగా మారిందని చెప్పారు.

చర్చా వేదికను విజయవంతం చేయండి

పెనుకొండ : పెనుకొండ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం, భవిష్యత్తుకు గ్యారెంటీ నియోజకవర్గ చర్చా వేదిక ను శుక్రవారం నిర్వహించనున్నామని ఈ చర్చావేదికను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ చర్చా వేదికకు నియోజకవర్గంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ కమిటీల సభ్యులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కడపకు తరలిన టిడిపి నాయకులు

కడపకు బయలుదేరి వెళుతున్న మడకశిర, పెనుకొండ టిడిపి నాయకులు

మడకశిర : రాయలసీమ డిక్లరేషన్‌పై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ బాబు ఆధ్వర్యంలో కడపలో జరిగే సమావేశానికి మడకశిర నియోజకవర్గం నుంచి టిడిపి నాయకులు తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి తరలివెళ్లారు. బుధవారం సాయంత్రం 5గంటలకు కడపలో రాయలసీమ పార్టీ నేతలతో లోకేశ్ బాబు భేటీ అయ్యారు. మిషన్ రాయలసీమ'పై రాయలసీమ ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమంలో మడకశిర నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ : యువగళం పాదయాత్ర నేపథ్యంలో రాయలసీమలోని సమస్యలపై మిషన్ రాయలసీమలో భాగంగా బుధవారం కడపలో నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంఘీభావ చర్చా వేదికకు శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె పార్థసారథి ఆధ్వర్యంలో పెనుకొండ నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నరసింహులు, పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, జివిపి నాయుడు, మండల కన్వీనర్ నరహరి, రొద్దం క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగేంద్ర, రవి, మండలనాయకులు తదితరులు తరలివెళ్లారు.

నేరాలు ఘోరాలు

పేకాట జూదరులు అరెస్టు

ముదిగుబ్బ : మండలంలోని టిఎన్ పాళ్యం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసినట్లు సిఐ కంబగిరి రాముడు తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 19 మంది పేకాట రాయుళ్ల అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.1,20,350ల నగదు, రెండు జీపులు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం పోలీసులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

పరిగి : పరీక్షల్లో మరోసారి ఫెయిల్ అవుతానని మనస్థాపనతో 10వ తరగతి విద్యార్థిని ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పరిగి మండలం కోడిగినహళ్లి దళితవాడలో బుధవారం చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాలు... ఎస్సీ కాలనీకి చెందిన విద్యార్థిని గౌతమి(15) ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో రాసింది. అయితే ఫలితాల్లో గణిత శాస్త్రం సబ్జెక్టులో ఫెయిల్ అవ్వడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈసారి సప్లమెంటరీ పరీక్షల్లో పాస్ అవుతానని కుటుంబ సభ్యులకు ఆమె హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం గణిత శాస్త్రం పరీక్షలను రాసింది. ఈ పరీక్ష సరిగ్గా రాయలేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో సంఘటనా స్థలానికి పోలీసులు సందర్శించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా... యువకుడు మృతి

చిలమత్తూరు : మండలంలోని కోడూరు తోపు సమీపంలో సర్వీస్ రోడ్డుపై ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. దివాకర్ (20) అనే దినసరి కూలీ పెద్దన పల్లి గ్రామంలో ఇటుకలు అన్ లోడ్ చేసేందుకు వెళ్లాడు. పని ముగించుకొని అక్కడ ఉన్న వ్యవసాయ సామగ్రిని ట్రాక్టర్ ట్రాలీలో వేసుకొని కోడూరు సర్వీస్ రోడ్డులో వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాలీలో ముగ్గురు, ట్రాక్టర్ ఇంజన్ పై డ్రైవర్ తో పాటు ఇంకొకరు ఉన్నారు. ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాలీలో ఉన్న కోడూరుకు చెందిన దివాకర్ (20) ట్రాలీ కింద చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి రక్తగాయాలు కాగా బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో కోడూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

మద్యం తరలింపుదారులు అరెస్టు

తనకల్లు : మండలం ఈ తోడు క్రాస్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వల్లిపి మధు, మూడే సాయి నాయక్, భూక్య భరత్ నాయక్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రెండు మోటార్ సైకిళ్ళను, 12 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ చెప్పారు.

విఆర్ఒ ఆత్మహత్య

లేపాక్షి : మండలం పరిధిలోని చోళసముద్రం గ్రామానికి చెందిన విఆర్ఒ శ్రీనివాసులు(57) ఆత్మహత్య చేసుకున్నాడు. మానసిక సమస్యతో బాధపడుతున్న ఆయన ఇంట్లోఎవరు లేని సమయంలో చీరతో ఫ్యాన్ కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాసులు రొద్దం మండలం నారనాగేపల్లి విఆర్ఒగా పనిచేస్తుండేవాడని గ్రామస్తులు తెలిపారు. మృతుని భార్య జయలక్ష్మి ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

బత్తలపల్లి : మండలంలోని అప్రాచెరువు గ్రామానికి చెందిన ఆకులేటి పెద్దన్న(51) మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఆకులేటి పెద్దన్న మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చీకటి పడుతున్న ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలిస్తుండగా కుక్కల అరుపులకు అటుగా వెళ్లి చూశారు. బహిర్భూమికి వెళ్లిన చోటే పెద్దన్న విగతజీవిగా పడి ఉండడాన్ని గుర్తించారు. బహిర్భూమికి వెళ్ళినప్పుడు గుండెపోటుకు గురై మృతి చెందిఉంటాడని గ్రామస్తులు, మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. మతునికి భార్యతో పాటు కుమారుడు కుమార్తె ఉన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

రొద్దం : మండలంలోని కంచెసముద్రం గ్రామంలో అనంతశక్తి సొసైటీ సిఇఒ లావణ్య అధ్యక్షతన కిష్టమ్మ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చాలా అత్యవసరమని అత్యంత ముఖ్యమని పలువురు మహిళలకు సూచించారు. ఇందులో భాగంగా మహాశక్తి సిఇఒ రమీజా, టింబక్టివ్ కలెక్టివ్ నుంచి సుకన్య, మహాశక్తి వైస్ ప్రెసిడెంట్ రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పట్టించుకోని ప్రభుత్వాలు

పుట్టపర్తి అర్బన్ : నిరుద్యోగ సమస్య పెరిగిపోతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు విమర్శించారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎఐవైఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్న ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. ప్రతి ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న ముఖ్యమంత్రి జగన్ ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఈనెల 27 నుంచి 30 వరకు గుంటూరులో నిర్వహించే విద్య విజ్ఞానిక సాంస్కృతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, అధ్యక్షులు రాజా, ఉపాధ్యక్షులు మహేంద్ర, లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

తలుపుల : ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గజ్జలప్పగారిపల్లి, లక్కసముద్రం, బాలిరెడ్డిపల్లి, గొందిపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి రెడ్డెం తులసమ్మ, ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, సేవాదళ్ జోనల్ అధ్యక్షులు డీకే బాబు, పురుషోత్తం రెడ్డి, యువ నాయకులు రెడ్డెం సుదర్శన్ రెడ్డి, సర్పంచులు మాజీ సర్పంచులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ సాయం

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద రైతుకు సాయం అందే విధంగా చర్యలు చేపడుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు గ్రామంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ పనిముట్లు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వ్యవసాయ పనిముట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని అన్నారు. ప్రభుత్వం వెంగళమ్మ చెరువు వాటర్ షెడ్ క్రింద ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు ఏపీడీ కృష్ణచైతన్య, అగ్రి అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ ఏవి రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనర్సమ్మ గంగాధర , మండల కన్వీనర్ నరసారెడ్డి, డిసిసి డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి ,వైసీపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ మండల కమిటీ ఛైర్మన్ సూర్యనారాయణ వెంగళమ్మ చెరువు వాటర్ షెడ్ ఛైర్మన్ ఆనంద్, తిమ్మప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.